
సాక్షి
నంద్యాల

బుధవారం । 15 । నవంబర్ । 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: ఆలయప్రాంగణంలో శనగల బసవన్న నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకుడు బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా అర్చకులు పూజలు నిర్వహించారు.



వైభవంగా బలిపాడ్యమి వేడుకలు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి మఠంలో కార్తీక మాసం బలి పాడ్యమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు మూలరాములకు అభిషేక పూజలు నిర్వహించారు.



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు మంగళవారం 2,354 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఉమ్మడి బ్యాంక్ ఖాతా తప్పనిసరి

నంద్యాల(న్యూటౌన్): జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన పథకానికి తల్లితో పాటు విద్యార్థికి ఉమ్మడిగా బ్యాంక్ ఖాతా తప్పనిసరిగా ఉండాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామని మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆయా పథకాలకు సంబంధించి ఇప్పటివరకు విద్యార్థుల తల్లుల ఖాతాలలోనే ఆ మొత్తాన్ని జమ చేసేవారన్నారు. ఇకపై జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెనలో అర్హులైన విద్యార్థులు తమ తల్లితో కలిసి ఉమ్మడి ఖాతా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొత్తగా ఈ ఖాతాలో విద్యార్థి ప్రాథమిక ఖాతాదారునిగా, తల్లి ద్వితీయ ఖాతాదారునిగా ఉండాలన్నారు. ఇప్పటికే విద్యార్థి, తల్లికి బ్యాంక్ ఖాతా ఉంటే ఉమ్మడిగా చేర్చి మార్చుకోవచ్చన్నారు. తల్లులతో పాటు విద్యార్థులకు బాధ్యత ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఎస్సీ, చివరి సంవత్సరం చదువుతున్న అన్ని క్యాటగిరీ విద్యార్థులకు జాయింట్ బ్యాంక్ ఖాతా అవసరం లేదన్నారు. నాలుగవ విడత జగనన్న విద్యా దీవెన పథకం కోసం ఈ నెల 24వ తేదీలోగా ఖాతాలు ఓపెన్ చేసి జేవీడీకి అర్హులైన విద్యార్థిని, విద్యార్థుల వారి పరిధిలో ఉన్న సచివాలయాల్లో జాయింట్ బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇవ్వాలన్నారు.

నేటి నుంచి పశు ఆరోగ్య కార్డుల పంపిణీ

నంద్యాల(సెంట్రల్):రాష్ట్ర ప్రభుత్వం పశు విజ్ఞాన బడిలో భాగంగా పశువైద్య సేవల్ని ఆర్‌బీకేల స్థాయికి విస్తరించేందుకు శ్రీకారం చుట్టింది. దీనికి అనుగుణంగా మూగజీవాలకు సైతం ఆరోగ్య కార్డుల్ని జారీ చేస్తోంది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఈ నెల 30 వరకు ఆరోగ్య కార్డుల్ని పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి గోవిందనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.జిల్లాలో మొత్తం 97,900 ఆవులు, గేదెలతో పాటు 22,400 మేకలు, గొర్రెలకు ఈ కార్యక్రమంలో భాగంగా కార్డుల్ని ఇవ్వనున్నామన్నారు. కార్డులో పశువులకు అందించే వైద్య సేవలు, ఉచిత టీకాల వివరాలు ఉంటాయన్నారు. కార్డుతో పెంపకందారులు అత్యవసర వైద్య సంరక్షణ నుంచి టీకాల వరకు అనేక వైద్య సేవల్ని రూపాయి ఖర్చు లేకుండా ఆర్‌బీకేల స్థాయిలోనే పొందేందుకు కార్డులు ఉపకరిస్తాయని ఆయన పేర్కొన్నారు.

రూ.80 కోట్లతో 30 రోడ్లకు టెండర్లు పూర్తి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.80 కోట్లతో 30 రోడ్ల పనులు చేపట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యమైన రోడ్లను అభివృద్ధి చేసేందుకు సీఎంఓ ప్రతిపాదనలు కోరిందన్నారు. రూ.45.60 కోట్ల అంచనాతో 21 మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్, స్టేట్ హైవేస్ కింద రూ.34.40 కోట్ల అంచనాతో 9 రోడ్లకు ప్రతిపాదనలు పంపగా, వాటిని ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఈ నేపథ్యంలోనే టెండర్లను కూడా పూర్తి చేశామన్నారు.

పనులకు అగ్రిమెంట్ పూర్తయిన రోడ్లు

- పెద్దకడుబూరు నుంచి దొడ్డిమేకల వరకు 10 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.30 కోట్లు
- కపటి నుంచి పెద్దతుంబళం వరకు 13 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2.60 కోట్లు.
- నెల్లూరు–బళ్లారి–బాంబే హైవేలో 231/2 కి.మీ నుంచి 233/1 వరకు రూ.1.20 కోట్లు
- డోన్ – రాయలచెరువు 1/6 నుంచి 2/0 కి.మీ వరకు రూ.50 లక్షలు.

క్వింటా మిర్చి రూ.27,525

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిర్చి ధర జోరుమీద ఉంది. 2023–24లో సాగు చేసిన మిర్చి పంటకు సంబంధించిన దిగుబడులు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. మంగళవారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 105 క్వింటాళ్లు అమ్మకానికి రాగా.. అత్యధికంగా రూ.27,525 ధర లభించడం విశేషం. కనిష్ట ధర రూ.5,099, మోడల్ ధర రూ.15,509 నమోదైంది. 2022–23లో జిల్లాలో 1.26 లక్షల ఎకరాల్లో మిర్చి సాగయింది. 2023–24లో 1.48 లక్షల ఎకరాల్లో మిర్చి సాగవడం విశేషం.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి సుంకేసుల రిజర్వాయర్ నుంచి మంగళవారం కూడా వరద ప్రవాహం కొనసాగింది. 4,446 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. డ్యాం నుంచి దిగువ ప్రాంతాలకు 4,451 క్యూసెక్కుల వరద నీరు సోమవారం నుంచి మంగళవారం వరకు విడుదలైంది. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 0.169 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 335 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలస్రవంతికి 1210 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 367, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 64.4208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటి మట్టం 841.70 అడుగులకు చేరుకుంది.

పట్టాభిషేకానికి వేళాయె!

- బొగ్గులైన్ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న 285 కుటుంబాలు
- నిరాశ్రయులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కర్నూలు హైవే పక్కనే ఇళ్ల స్థలాలు
- లేఅవుట్ అభివృద్ధి, వసతుల కల్పన
- ప్రస్తుతం ఇక్కడ సెంటు విలువ రూ.10 లక్షల పైనే
- నేడు పట్టాలను పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే శిల్పా రవి



పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసిన లే అవుట్

సాక్షి, నంద్యాల/నంద్యాల (సిటీ): వారంతా నిరుపేదలు. కొన్నేళ్లుగా రహదారి పక్కన ఆవాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. రయ్..రయ్‌మంటూ దూసుకెళ్లే వాహనాల భయంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని కాలం గడిపారు. ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అయినా పేదరికంతో అక్కడి నుంచి వెళ్లలేని పరిస్థితి. చివరకు రహదారి విస్తరణలో రోడ్డున పడిన నిర్వాసితులకు మేమున్నామంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. రూ. లక్షల విలువైన స్థలాన్ని ఉచితంగా పట్టాగా అందజేస్తుండటంతో వారిలో పట్టరాని ఆనందం నెలకొంది. నంద్యాల పట్టణంలో బొగ్గులైన్ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన పేదలకు బుధవారం ప్రభుత్వం పక్కా పట్టాలు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంగా మారిన నంద్యాల పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పట్టణ జనాభాకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలో బొమ్మలసత్రం నుంచి నూనెపల్లె వరకు రహదారి విస్తరణ చేపట్టారు. రోడ్డు విస్తరణతో పాటు రెండు వైపులా డ్రైనేజీ, మధ్యలో డివైడర్, వీధి దీపాలు, పాదాచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్ నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఈ రహదారికి ఇరువైపులా బొగ్గులైన్‌లో కొన్నేళ్లుగా అక్రమంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని దాదాపు 285 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రత్యామ్నాయం చూపిన తర్వాతనే పనులు చేపట్టేలా ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు శరవేగంగా లేఅవుట్‌ను అభివృద్ధి చేసి పట్టాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసి తమది పేదల ప్రభుత్వమని మరోసారి చాటింది.

నేషనల్ హైవే పక్కనే..

బొగ్గులైన్ నిర్వాసితులందరికీ నంద్యాల – కర్నూలు నేషనల్ హైవే పక్కనే ఇళ్ల స్థలాలు కేటాయించింది. కుటుంబానికి సెంటు చొప్పున బుధవారం పంపిణీ చేయనుంది. ప్రస్తుతం ఇక్కడ మార్కెట్ విలువ ప్రకారం సెంటు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు పలుకుతోంది. ఇళ్లస్థలాలు ఇవ్వడమే కాకుండా కోట్ల రూపాయలతో లేఅవుట్‌ను అధికారులు అభివృద్ధి చేశారు. రూ.47 లక్షలతో 1.7 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్లు నిర్మించారు. ఒక్కో రోడ్డు 7 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా రూ.20 లక్షలతో బోర్లు కూడా వేయించారు. గ్రావెల్ రోడ్డు వెంబడి రూ.20 లక్షలతో విద్యుత్ స్తంభాలను కూడా ఏర్పాటు చేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం



నంద్యాల ప్రజలు శిల్పా కుటుంబంపై పెట్టుకున్న నమ్మకాన్ని మరోసారి నిలబెట్టుకున్నాం. పేదలందరికీ సొంతిళ్లే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోంది. జగనన్న లేఅవుట్‌పై టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి నీచ రాజకీయాలు చేశారు. అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వమే భరోసా కల్పిస్తూ రూ.10 లక్షల విలువైన ఆస్తిని పేదలకు ఇస్తున్నాం. బొగ్గులైన్ నిరాశ్రయులకు నా హయాంలో పట్టాలు ఇస్తుండటం ఆనందంగా ఉంది. – ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

సంతోషంగా ఉంది



నంద్యాల పట్టణంలోని బొగ్గులైన్‌లో 25 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాం. రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయని అధికారులు గతంలో చెప్పారు. ఇళ్లను బలవంతంగా ఖాళీ చేయించకుండా ఉచితంగా స్థల పట్టాలు పంపిణీ చేసిన తర్వాతనే ఖాళీ చేయిస్తామని హామీ ఇచ్చారు. మాట ఇచ్చినట్లుగా నేడు పట్టాలు చేతికందుతుండటం సంతోషంగా ఉంది.

– బి.లలితమ్మ, నిర్వాసితురాలు, నంద్యాల

రూ.10 లక్షల ఆస్తిని ఉచితంగా ఇస్తున్నారు



కూలీ నాలీ చేసుకుంటూ బతుకుతూ ఎన్నో ఏళ్లుగా బొగ్గులైన్ ప్రాంతంలోనే ఉంటున్నాం. మెయిన్ రోడ్డు కావడంతో చాలా ప్రమాదాలు జరిగాయి. బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం. ఇప్పుడు అభివృద్ధి చేసిన లే అవుట్‌లోనే స్థలాలు ఇస్తున్నారు. రూ. 10 లక్షల విలువ చేసే స్థలాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

– ఎస్.కలేషా, నిర్వాసితుడు, నంద్యాల

సీఎం, ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



30 ఏళ్లుగా బొగ్గులైన్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాం. మమ్మల్ని పట్టించుకున్న నాయకులు లేరు. కానీ, నేడు మా ఇంటికి వచ్చి మరీ ఇంటి పట్టా ఉచితంగా ఇవ్వడం ఆనందంగా ఉంది. స్థలాన్ని కూడా అభివృద్ధి చేయడం బాగుంది. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– బొల్లెద్దు మరియమ్మ, నిర్వాసితురాలు, నంద్యాల



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఈఓ దంపతులు



ధ్వజస్తంభంపై వెలుగుతున్న ఆకాశదీపం

శ్రీగిరిలో కార్తీక శోభ

- కార్తీకమాసం మొదటి రోజు మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేసిన దేవస్థానం

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం కార్తీక శోభను సంతరించుకుంది. మంగళవారం శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. కార్తీకమాసోత్సవ నిర్వహణకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం కార్తీకమాసం మొదటి రోజు పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. వేకువజామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు వెలిగించి స్వామిఅమ్మవార్ల దర్శనానికి తరలివచ్చారు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు గర్భాలయ, సామూహిక అభిషేకాలను రద్దు చేశారు. భక్తులు కార్తీక దీపారాధన చేసుకునేందుకు వీలుగా ఆలయం ఎదురు గంగాధర మండపం వద్ద, ఉత్తరమాఢవీధిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానంతో పాటు బెంగుళూరుకు చెందిన జాతీయ, సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ సంయుక్త నిర్వహణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వెలిగిన ఆకాశ దీపం

కార్తీకమాసోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆలయప్రాంగణంలో ఆకాశదీపాన్ని వెలిగించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణ పతి పూజ జరిపించిన అనంతరం దీపప్రజ్వలన, దీపారాధన జరిపారు. ఈ ఆకాశదీపాన్ని వెలిగించినా, చూసినా సకల పాపాలు నశించి అనంత పుణ్యం లభిస్తుందని, వ్యాధులు తొలగి ఆయురారోగ్యాలు చేకూరతాయని పడితులు పేర్కొన్నారు. కార్తీకమాసం ముగింపు వరకు ప్రతి రోజు ఈ దీపాన్ని వెలిగించడం జరుగుతుంది.

సహకార వ్యవస్థ ప్రాధాన్యతను పెంచుదాం

- సహకార వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో డీసీసీబీ చైర్‌పర్సన్

కర్నూలు(అగ్రికల్చర్): సహకార వ్యవస్థ ప్రాధాన్యతను మరింత పెంచుదామని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. మంగళవారం ఉమ్మడి కర్నూలు డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఆమె సహకార పతాకాన్ని ఆవిష్కరించి 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం సహకార సమృద్ధి డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభించి ఈ నెల 14 నుంచి వచ్చే నెల 13 వరకు మాత్రమే అమలులో ఉంటుందని తెలిపారు. అత్యధిక వడ్డీరేటుతో డిపాజిట్ స్కీమ్‌ను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు, డైరెక్టర్లు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, రాఘవేంద్ర, సీమ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సహకార సమృద్ధి డిపాజిట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి



ఎమ్మెల్యే కాటసాని సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరిన పెసరవాయి టీడీపీ శ్రేణులు

టీడీపీకి భారీ షాక్

- పెసరవాయిలో 150 కుటుంబాలు వైఎస్ఆర్‌సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల:మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. తెలుగుదేశంలో ఎంత కష్టపడినా గుర్తింపు లేదని పెసరవాయి గ్రామానికి చెందిన సుమారు 150 కుటుంబాలు మంగళవారం ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరాయి. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లారెడ్డి,శిరుప శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి ఆధ్వర్యంలో ఏసురత్నం, రాజేష్, లివికుమార్, రాజు, వెంకటరమణ,జగన్, తులషమ్మ, వెంకటలక్ష్మి, చల్లా వెంకటేశ్వర్లు, ఫాతిమా, ఆవుల నాగలక్ష్మమ్మ, వెంకటలక్ష్మమ్మలతో పాటు పలువురు టీడీపీ శ్రేణులు వైఎస్ఆర్‌సీపీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన, వెనుకబడిన వర్గాలకు కల్పిస్తున్న ప్రాధాన్యతకు ఆకర్షితులై పార్టీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. తమ పార్టీ బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. అంతకు ముందు పార్టీలో కొత్తగా చేరిన వారు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ సంఘం విభాగం అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సులభం.. పారదర్శకం

- ఇక అర గంటలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి
- జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి కార్డ్‌ప్రైమ్ 2.0 విధానం
- ఆన్‌లైన్‌లోనే దస్తావేజులు, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు



నంద్యాల పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సాక్షి, నంద్యాల: ఆస్తుల క్రయ, విక్రయ సమయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఓ ప్రహసనంలా సాగుతోంది. ఏజెంట్ల ప్రమేయం, సాఫ్ట్‌వేర్ అంతరాయం తదితర కారణాలతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఇక నుంచి అన్ని సమస్యలకు చెక్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇప్పటి వరకు డాక్యుమెంట్ తయారీ, చలానా చెల్లింపులన్నీ రిజిస్ట్రేషన్ శాఖతో సంబంధం లేకుండా బయట జరిగేవి. వీటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందజేస్తే.. అక్కడే రిజిస్ట్రేషన్లు చేసేవారు. ఇకపై నూతన విధానంలో చాలా తక్కువ సమయంలో సులభంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతాయి. మధ్యవర్తులపై ప్రజలు ఆధారపడకుండా సులభంగా రిజిస్ట్రేషన్లు చేసుకునేలా ఈ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్)ను ఆధునికీకరించి కార్డ్ 2.0గా రూపకల్పన చేసింది. డాక్యుమెంట్‌ను ఎవరికి వారే ఆన్‌లైన్‌లో తయారుచేసుకుని, ఆన్‌లైన్‌లోనే చలానా(స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు) కట్టి, టైం స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్ బుక్ చేసుకున్న రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే అక్కడ డాక్యుమెంట్స్ అన్నీ పరిశీలించిన తర్వాత కేవలం 20 నుంచి 30 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. నూతన విధానం మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. జిల్లాలో 13 రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో రోజూ 300 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.కార్డ్ ప్రైమ్ 2.0పై స్టాంప్ వెండర్స్‌కు అవగాహన కూడా కల్పించారు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు తదితర సమాచారాన్ని ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తికి సంబంధించిన మార్కెట్ విలువ,స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు,యూజర్ చార్జీల వివరాలన్నీ డిస్‌ప్లే అవుతాయి. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనే చెల్లించొచ్చు.

బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేదు



ఈ స్టాంపింగ్‌తో బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. సమయం వృథా కాకుండా ఒకే చోట కూర్చొని పని పూర్తి చేయొచ్చు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన సాఫ్ట్‌వేర్ వినియోగదారులకు ఎంతో ఉపయోగపడుతుంది. పాత తేదీలతో స్టాంప్స్ విక్రయించి డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు చేయడం అస్సలు కుదరదు. – ఉస్సేనమ్మ, స్టాంప్ వెండర్, బేతంచెర్ల

కొత్త పద్ధతి చాలా సులువు



కొత్త పద్ధతిపై అధికారులు ఇప్పటికే డెమో చూపించారు. ఇది చాలా సులభంగా ఉంది. ప్రస్తుతమంతా డిజిటల్ యుగం కాబట్టి చదువుకున్న వారంతా ఇంట్లో కూర్చొనే డాక్యుమెంట్స్ రాసుకోవచ్చు. డాక్యుమెంట్స్ రైటర్స్ చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరిగే పని తగ్గుతుంది. బయోమెట్రిక్ ద్వారా వేలిముద్రలు వేసేందుకు మాత్రమే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తే సరిపోతుంది.

– లక్ష్మి భారతి, స్టాంప్ వెండర్, నంద్యాల

పారదర్శకంగా ప్రక్రియ

కొత్త సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుంది. డబుల్ రిజిస్ట్రేషన్లు పూర్తిగా మాయమవుతాయి. నిషేధిత ఆస్తులు, ప్రభుత్వ భూములను తప్పుడు డాక్యుమెంట్స్‌తో రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉండదు. దస్తావేజుల్లో కక్షిదారులతో పాటు దాన్ని రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ల సంతకాలు కూడా ఈ సైన్ ద్వారా తీసుకుంటారు. ఆన్‌లైన్‌లోనే స్టాంప్‌లను విక్రయించడం ద్వారా పాత తేదీలతో డాక్యుమెంట్స్ చేయడానికి అస్సలు వీలుపడదు. – చెన్నకేశవరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్, నంద్యాల

కంప్యూటర్ ఆపరేటర్లకు స్థానాల కేటాయింపు

- కౌన్సెలింగ్ ద్వారా మండలాలకు నియామకం
- నేడు సాంకేతిక సహాయకులకు కౌన్సెలింగ్

కర్నూలు(అగ్రికల్చర్): రేషనలైజేషన్‌లో భాగంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కొద్ది నెలల క్రితం బదిలీ అయిన కంప్యూటర్ ఆపరేటర్లు, సాంకేతిక సహాయకుల్లో (టీఏ) పలువురిని గ్రామీణాభివృద్ధి శాఖ తిరిగి ఉమ్మడి కర్నూలు జిల్లాకు కేటాయించింది. ఉమ్మడి జిల్లాకు 92 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 140 మంది సాంకేతిక సహాయకులు రావడంతో వారికి కౌన్సెలింగ్ ద్వారా మండలాలు కేటాయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా కర్నూలు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం 92 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం సాంకేతిక సహాయకులకు జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కర్నూలు డ్వామా పీడీ ఆధ్వర్యంలోని కమిటీలో నంద్యాల జిల్లా డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, డ్వామా పరిపాలనాధికారి విజయలక్ష్మి ఉన్నారు.


గాత్రంలో శిక్షణ..

రాగ పరిమళం.. నృత్య నీరాజనం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

50 ఏళ్లకు పైగా కళామతల్లి సేవ

- సంగీతంపై మక్కువ పెంచుతున్న కళాశాల
- ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రదర్శన
- అనువైన సమయాల్లో శిక్షణ
- మానసిక ప్రశాంతతో పాటు ఉద్యోగ అవకాశం
- గృహిణులతో పాటు ఉద్యోగుల ఆసక్తి



సంగీతం పేరు చెప్పగానే రాష్ట్ర ప్రజలకు ముందుగా గుర్తుకొచ్చే పేరు పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినాకపాణి. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ వైద్యులుగా కర్నూలు మెడికల్ కళాశాలలో పనిచేస్తూ ఇక్కడే పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత తుదిశ్వాస విడిచే వరకు కర్నూలులోనే ఉండిపోయారు. రోగాలను, రాగాలను సరిచేసిన సవ్యసాచిగా పేరుగడించారు. శాస్త్రీయ సంగీతానికి ఊపిరి పోసిన ఆయన ఎంతో మందిని వైద్య నిష్ణాతులుగా, సంగీత శిఖామణులుగా తీర్చిదిద్దడం విశేషం.



వయస్సు అంకె మాత్రమే..

కళాశాలకు వచ్చే విద్యార్థులను చూస్తే వయస్సు ఒక అంకె మాత్రమే అనే విషయం ఇట్టే అర్థమవుతుంది. ఈ వయస్సులోనే చదువుకోవాలి, ఆ వయస్సులోనే ఏదైనా సాధ్యమనే భావనను చెరిపేస్తున్నరు ఇక్కడి విద్యార్థులు. 60 ఏళ్లకు పైబడిన వృద్ధులతో పాటు నాలుగైదేళ్ల చిన్నారులు సైతం ఇక్కడ శిక్షణ పొందుతుండటం విశేషం. కుల మతాలకు అతీతంగా, వయస్సు భేదం లేకుండా ఇక్కడ పలుకుతున్న రాగాలు.. కదులుతున్న అందియలను చూస్తే ఎంతో ముచ్చటేస్తుంది.

దాసరి పార్వతి. కృష్ణగిరి మండలం లక్కసాగరం గ్రామానికి చెందిన ఈ యువతి పాటతోనే ప్రపంచానికి పరిచయమైంది. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఈమె ఒకప్పుడు సంగీతం నేర్చుకోవడానికి మరో ప్రాంతానికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అలాంటిది ఈమె గొంతులో పలికిన పాట తన గ్రామం ఎప్పుడూ చూడని బస్సును పరిచయం చేయగలిగింది. ఈమె ఒక్కరే కాదు.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ జిల్లాకు చెందిన ఎంతో మంది ఇటీవల కాలంలో టెలివిజన్ కార్యక్రమాలతో తమ ప్రతిభను చాటుతున్నారు.

రోజంతా ఉత్సాహం

నా భర్త ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నారు. పిల్లలు పాఠశాలకు వెళ్లే వరకు ఒకటే హడావుడి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి పనులు ఉండనే ఉంటాయి. చిన్నప్పటి నుంచి పాటలు పాడటం అంటే ఎంతో ఇష్టం. పెళ్లయిన 14 ఏళ్లకు మా ఆయన ప్రోత్సాహంతో శారద కళాశాలలో చేరి గాత్రంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నా. మానసిక ప్రశాంతతో పాటు రోజంతా ఉత్సాహంగా ఉండగలుగుతున్నా.

– అంబిక, గృహిణి, కర్నూలు

మానసిక ప్రశాంతత లభిస్తుంది



వైద్య వృత్తి కావడంతో మానసికంగా ఎంతో ఒత్తిడి ఉంటుంది. చిన్నప్పటి నుంచి నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండటంతో ఎండీ పూర్తయ్యాక రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నా. ఆ సమయంలోనే శ్రీశైలం, అహోబిళం, విజయవాడలో ప్రదర్శనలు కూడా ఇవ్వడం మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. నృత్యం చేయడం ద్వారా మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండగలుగుతాం. నృత్యం, సంగీతం విలువ తెలుసు కాబట్టి మా పాపకు ఇప్పటి నుంచే శిక్షణ ఇప్పిస్తున్నా. నృత్యం చేయడం ద్వారా కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేం. – చందన రాజారామ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు మెడికల్ కళాశాల

సాక్షి, కర్నూలు డెస్క్

ఒకప్పుడు పెళ్లి చూపులు అనగానే సంగీతం వచ్చా అని అడిగేవారు. ఏదమ్మా ఓ పాట పాడమని అడిగి మరీ మైమరిచిపోయేవారు. ఆ తర్వాత.. సంగీతం ఏముందిలే, పిల్లలకు జోలపాట పాడితే చాలనుకున్నారు. ఇప్పుడిక అమ్మాయిలు దొరకడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో సంగీతం మాటే మర్చి సర్దుకుపోతున్నారు. పిల్లలకు కనీస సంగీత జ్ఞానం నేర్పుదామని కొందరు తల్లిదండ్రులు భావిస్తున్నా.. ఆ దిశగా గొంతు విప్పేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితి. కనీసం టీవీల్లో పాత పాటలు చూద్దామన్నా.. పిల్లలు రిమోట్ లాగేసుకొని మార్చేయడం ప్రతి ఇంట్లో కనిపించే తంతే. పండగలు పబ్బాల సమయంలో ఏ గుడిలోనో, లేక ప్రత్యేక కార్యక్రమాల్లోనో తప్ప కచేరీల ఊసే ఉండటం లేదు. ఇక కొన్ని వాయిద్యాల పేర్లు కూడా ఇప్పటి తరం తెలుసుకోలేకపోవడం చూస్తే సంగీతం ఏస్థాయిలో కనుమరుగవుతుందో అర్థమవుతోంది. ఇలాంటి రోజుల్లో కూడా కర్నూలు నగరంలోని


కర్నూలులోని ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల

ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాల సంగీత పరిమళాలను వెదజల్లుతోంది. ఆ భవనం నుంచి ప్రతి రోజూ వినిపించే రాగాలను వింటే ఎప్పుడో ఒకప్పుడు తిరిగి పూర్వ వైభవం వస్తుందనే ఆశ కలుగుతుంది.

అందరికీ అనువైన సమయంలో..

ఇప్పుడున్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను ర్యాంకుల వెంట పరుగులు తీయిస్తున్నారు. ఆ దిశగానే పిల్లల బుర్రలను పదును పెడుతున్నారు. పాఠశాలకు వెళ్లామా.. ఇంటికి వచ్చామా.. ఇలానే సాగుతోంది జీవనం. చాలా అరుదుగా పిల్లలను సంగీతంలోనూ తీర్చిదిద్దాలనే ఆలోచనకు వేదికగా నిలిచిన శారద సంగీత కళాశాల అనువైన సమయాల్లోనే శిక్షణ ఇస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కర్నూలు పాత బస్టాండ్ ప్రాంతంలోని ఓ భవనం ఎన్నో రాగాలను పలుకుతోంది. పాటలు పాడించడమే కాదు వివిధ రకాల వాయిద్యాలను పలికించడంలోనూ నిష్ణాతులను చేస్తోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులు కూడా తోడు కావడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

జీవితంలో స్థిరపడే దిశగా..

సంగీతం నేర్చుకుంటే ఏమొస్తుంది, మహా అయితే ఇంట్లో కూనిరాగాలు తీయడం మినహా అనే భావనను ఈ కళాశాల తొలగిస్తోంది. తీరిక సమయాల్లో తీసుకునే శిక్షణ జీవితంలో స్థిరపడేందుకు బాటలు కూడా వేస్తోంది. ఇక్కడ సర్టిఫికెట్ కోర్సులతో పాటు డిగ్రీలు కూడా చేసే అవకాశం ఉండటంతో పాఠశాలల్లో ఆయా విభాగాల ఉపాధ్యాయులుగా కూడా రాణిస్తున్నారు. శారద కళాశాల నుంచి ఇప్పటి వరకు 50 మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

ఎన్నో వ్యాధులను నయం చేసే శక్తి

పాటకు రాళ్లను కరిగించే శక్తి కూడా ఉందంటారు. అంతేకాదు.. ఇటీవల కాలంలో పెద్ద పెద్ద ఆపరేషన్లు కూడా ఎలాంటి మత్తు ఇంజెక్షన్ ఇవ్వకుండా కేవలం మ్యూజిక్ వింటూనే చేయించుకున్న ఉదాహరణలు కూడా ఉన్నాయి. ఎలాంటి వ్యాధినైనా సంగీతం నయం చేస్తుందనే విషయం ఎన్నో పరిశోధనలు రుజువు చేశాయి. అమెరికాలో నిర్వహించిన ఓ పరిశోధన ఇదే విషయాన్ని వెల్లడి చేస్తోంది. రెండు రూములను ఎంచుకొని, ఒకే విధమైన విత్తనాలను వాటిలో పెంచడం మొదలుపెట్టారు. వీటిలో ఒక రూములో శాస్త్రీయ సంగీతం అదనంగా ఏర్పాటు చేశారు. అనూహ్యంగా ఈ మొక్కల ఎదుగుదల ఆరోగ్యకరంగా ఉన్నట్లు పరిశోధన ఫలితం వెల్లడైంది.

ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాలలో అందుబాటులోని కోర్సులు

● గాత్రం ● కూచిపూడి ● డోలు ● మృదంగం ● వీణ ● నాదస్వరం

గత ఐదేళ్లలో విద్యార్థుల సంఖ్య	
2018-19	230
2019-20	225
2020-21	232
2021-22	284
2022-23	325
2023-24	253

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- నాబార్డు జీఎం రాజ్‌కుమార్
- గోసానిపల్లెలో మినీ కూరగాయల మార్కెట్ ప్రారంభం

డోన్/రూరల్: రైతుల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని నాబార్డు జీఎం రాజ్‌కుమార్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలో కూరగాయలు, పూల సాగుకు ప్రసిద్ధిగాంచిన గోసానిపల్లె గ్రామంలో రూ.17 లక్షల వ్యయంతో నాబార్డు, ఫ్రెడ్ నిధులతో నిర్మించిన మినీ కూరగాయల మార్కెట్‌ను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ పండించిన దిగుబడులు తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్న విషయాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో మినీ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ మార్కెట్ ఏర్పాటుతో రైతులకు గిట్టుబాటు ధర లభించి లాభాలు గడిస్తారన్నారు. అలాగే కొచ్చెర్వు, చింతలపేట, గోసానిపల్లె, ధర్మవరం, కన్నపకుంట, కమలాపురం గ్రామాల రైతులకు దళారీల బెడద ఉండదన్నారు. మార్కెట్ ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ బాలమ్మ, ఎంపీటీసీ సభ్యులు మదనగోపాల్, స్థల దాతలు కీర్తిశేషులు మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పోలు వెంకటేశ్వరరెడ్డితో పాటు ఆయన సోదరులు పోలు నారాయణరెడ్డిని వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీడీఎం సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, దొరపల్లె చిరంజీవి, మాధవస్వామి, రామచంద్రారెడ్డి, హార్టికల్చర్ అధికారిని కల్యాణి తదితరులు పాల్గొన్నారు.


మినీ కూరగాయల మార్కెట్ భవన ప్రారంభ శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాబార్డు జీఎం రాజ్ కుమార్, మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ డివిజన్ ఏసీఎఫ్‌గా సూర్యచంద్ర రాజు



కర్నూలు కల్చరల్: అటవీ శాఖ డోన్ డివిజన్ అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్)గా ఎం. సూర్యచంద్ర రాజు నియమితులయ్యారు. ఈ మేరకు అటవీశాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదనరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు రేంజ్ ఎఫ్ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు ఏసీఎఫ్‌గా పదోన్నతి కల్పించి నంద్యాల సర్కిల్ పరిధిలోని డోన్ డివిజన్‌కు బదిలీ చేశారు. సూర్యచంద్రరాజును కర్నూలు రేంజ్ కార్యాలయ ఉద్యోగులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రబీ సీజన్‌కు 2,150 క్వింటాళ్ల వేరుశనగ

- పత్తికొండ సబ్ డివిజన్‌కు అత్యధికంగా 1,280 క్వింటాళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): రబీలో నీటి ఆధారంపై సాగుకు సబ్సిడీ వేరుశనగ విత్తనం కాయల పంపిణీకి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం జిల్లాకు 2,150 క్వింటాళ్ల వేరుశనగను కేటాయించింది. నీటి వసతిని బట్టి మండలాల వారీగా వేరుశనగను కేటాయిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అత్యధికంగా పత్తికొండ సబ్ డివిజన్‌కు 1,280 క్వింటాళ్లు కేటాయించారు. ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీ సీడ్స్) వేరుశనగ విత్తన కాయలను ఆర్బీకేల వారీగా పొజిషన్ చేస్తుంది.

త్వరలో కరువు ప్రాంతాలకు సెంట్రల్ టీమ్

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతాలుగా గుర్తించిన మండలాల్లో త్వరలో సెంట్రల్ టీమ్ పర్యటించనున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. సెంట్రల్ టీం రానున్న నేపథ్యంలో వ్యవసాయ యంత్రాంగం కరువుపై పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మంగళవారం గుంటూరు నుంచి వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కరువు, ఇతర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మరిన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలనే ప్రతిపాదనలు వస్తున్నాయని చెప్పారు. రబీలో శనగ సాగుకు అదును దాటిపోయినందున సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీని వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. నీటిపారుదల కింద వేరుశనగ సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని తెలిపారు. కర్నూలు నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏలు సాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.